
గండికోటతో ప్రపంచస్థాయి పర్యాటక గుర్తింపు

- భౌగోళిక ప్రాముఖ్యతతో విశిష్టత
- యునెస్కో గుర్తిస్తే పేరు ప్రతిష్టలు
- శ్రద్ధ చూపుతున్న కేంద్రం
- నేడు జాతీయ పర్యాటక దినోత్సవం


గడికోట పెన్నాలోయ

కడప కల్చరల్ : నేడు జాతీయ పర్యాటక దినోత్సవం. దేశంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల గుర్తింపు, వాటిపట్ల అవగాహన, ప్రచారం, వాటి ద్వారా ఆయా ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలపై చర్చించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తారు. మన జిల్లాకు సంబంధించి గండికోట అంతర్జాతీయ స్థాయిని స్వంతం చేసుకోగలిగే విశిష్టతలు కలిగి ఉంది. దాన్ని గుర్తిస్తే ఈ ప్రాంతానికి ప్రపంచ స్థాయి పర్యాటక గుర్తింపు లభిస్తుంది. పెన్నానది ఈ ప్రాంతంలోని ఎర్రమల కొండను నిలువునా చీలుస్తూ ప్రవహిస్తుంది గనుక దీన్ని గండికోట అని వ్యవహరిస్తున్నారు. పచ్చల నీలాల హారంగా అమరి చూపరులను కట్టి పడేస్తోంది. ఈ ప్రవాహానికి 90 మీటర్ల ఎత్తులో కోట నాటి వైభవానికి నిదర్శనంగా గంభీరంగా నిలిచి ఉంది. కోట పొడవు తూర్పు నుంచి పడమర వరకు 1200 మీటర్లు, వెడల్పు 800 మీటర్లుగా ఉంది. గండికోటను గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియాకు వ్యవహారిస్తారు. అమెరికా తర్వాత అలాంటి భౌగోళిక విశిష్టత గల ప్రాంతం మన గండికోట కావడం విశేషం. మిగతా లోయలలాగా గండికోట లోయ ఇరుకైనది కాదు. దాదాపు 300 మీటర్ల వెడల్పు కలిగి అత్యంత విశాలమైన మైదానం లాంటి లోయ ఉండడం దీని విశిష్టత. ఇలాంటి ప్రాంతాన్ని లోయమైదానం అంటారు. ఆంగ్లంలో క్యానియన్ అని వ్యవహరిస్తారు. అలాంటి విలక్షణమైన భౌగోళిక విశిష్టత కలిగిన పర్యాటక ప్రాంతం మన గండికోట కోట. అందుకే దీన్ని ఇతర పర్యాటక ప్రాంతాల్లాగా చూడకూడదని, ప్రపంచంలోని రెండవ భౌగోళిక విశిష్టతగల ప్రాంతంగా చూడాలని ఆ రంగ ప్రముఖులు తెలుపుతున్నారు.

రోప్‌వే అవసరం :

ఇలాంటి క్యానియన్‌పై రోప్‌వే అవసరం ఉంది. లోయపై రోప్‌వేలో వెళ్లడం అద్భుతమైన అనుభూతిని ఇవ్వగలదు. 2019లో ప్రారంభించి ఆపేసిన రోప్‌వేని ఇకనైనా నిర్మించి క్యానియన్ అభివృద్ధికి తోడ్పడితే జిల్లాకు ప్రపంచ స్థాయి పర్యాటక ప్రాంతంగా గుర్తింపు లభిస్తుంది. ఎప్పటికప్పుడు కొత్త పర్యాటక పథకాలను ప్రకటిస్తూ ఐదేళ్ల కాలం గడిపేయడం కాకుండా వాటిలో కనీసం అత్యవసరమైన రోప్‌వేను పూర్తి చేసి ఘనతను మూటగట్టుకోవాలని ఆ రంగ ప్రముఖులు సూచిస్తున్నారు. పర్యాటకాన్ని పరిశ్రమగా గుర్తిస్తామని గొప్పగా చెప్పిన ముఖ్యమంత్రి ఈ సౌకర్యాన్ని కల్పించి గండికోటకు, దాంతో జిల్లాకు ప్రపంచ స్థాయిగుర్తింపు కల్పించగలరని కోరుతున్నారు. కేంద్రం కరుణించి ఇటీవల ఇస్తున్న నిధులకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు పనులు చేపట్టి అనుకున్న సమయానికి పూర్తి చేయగలిగితే జిల్లా అభివృద్ధి చెందే అవకాశంతోపాటు ఈ ప్రాంతానికి యునెస్కో గుర్తింపు లభించే అవకాశం ఉందని తెలియజేస్తున్నారు.

సంధ్య సమయంలో..

ఇక్కడి భవనాలు, బురుజుల పైనుంచి సూర్యోదయం, సూర్యాస్తమయాలను పెన్నానది మీదుగా తిలకించడం గొప్ప అనుభూతిగా పర్యాటకులు పేర్కొంటున్నారు. ఈ దృశ్యాలను చూసేందుకు దేశం నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులు ఆ సమయానికి అక్కడికి చేరుకుని అందమైన ఆ దృశ్యాలను కెమెరాలు, వీడియోల్లో రికార్డు చేసుకుంటున్నారు. కోట సందర్శన సందర్భంగా గొప్ప అనుభూతి ఇచ్చే అంశాలలో ఇది ఒకటని భావిస్తారు. ఇక్కడి చారిత్రక ప్రదేశాలు, పురాతన ఆలయాలతో కూడిన ప్రాంతాలు అందరి దృష్టిని ఆకర్శిస్తున్నాయి. దక్షిణ ప్రాంత సినిమాల షూటింగ్‌లు తరుచూ ఇక్కడ చిత్రీకరిస్తున్నారు.కోట ప్రాంతాన్ని పర్యాటకులకు అన్ని వసతులతో అభివృద్ధి చేస్తే పర్యాటకంగా ఇది ప్రపంచ పటంలో ప్రముఖ స్థానం ఆక్రమించగలదని పర్యాటకాభిమానులు పేర్కొంటున్నారు.

క్లుప్తంగా

నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

కడప సెవెన్‌రోడ్స్ : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. నగరంలోని కోటిరెడ్డిసర్కిల్ నుంచి విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో అధికారులు ర్యాలీ నిర్వహించనున్నారు. కలెక్టరేట్ సభా భవనంలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం జరగనుంది. ఇందుకు సంబంధించి అధికారులు ఇప్పటికే అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. కొత్తగా ఓటర్లుగా నమోదైన యువతకు ఐడీ కార్డులు పంపిణీ చేయనున్నారు. అలాగే వృద్ధ ఓటర్లను ఈ సందర్భంగా సత్కరించనున్నారు.

ఆప్కాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య

కడప అర్బన్: అప్కాస్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పి. వెంకట సుబ్బయ్య నియమితులయ్యారు. ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్రకమిటీ అధ్యక్షుడు చిన్నబాబు ఆధ్వర్యంలో విజయవాడలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఏవి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆప్కాస్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ తక్షణమే ఎంటిఎస్‌ను అమలు చేయాలన్నారు. సమావేశంలో కోశాధికారి ఆర్. రజని, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలు కేటాయించాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఈడిగ కులస్తులు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఈడిగ కులస్తులకే మద్యం దుకాణాలు కేటాయించాలని కడప జిల్లా ఈడిగ (గౌడ) అసోసియేషన్ అధ్యక్షులు రవిశంకర్, గౌరవ అధ్యక్షులు వెంకట నరసయ్య, సహాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు కలెక్టర్ శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పించారు. జీఓ 16 ప్రకారం ఈడిగతోపాటు శ్రీ శయన, యాత, గౌడ్, సెట్టిబలిజ ఉప కులాలు ఉన్నాయన్నారు. జిల్లాలో ఈడిగ కులం తప్ప మిగతా కులాలు ఏవీ లేవని తెలిపారు. మద్యం షాపులు ఈడిగలకే కేటాయించాలన్నారు. ఈ విషయాన్ని తాను ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌కు పంపుతానని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఘాట్ రోడ్డులో అగ్నిప్రమాదం

చింతకొమ్మదిన్నె: గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో శుక్రవారం ఉదయం 5.30గంటల అగ్ని ప్రమాదం జరిగింది. టీఎస్ 23 టీహెచ్ 4383 నెంబర్ లారీ సిమెంట్ లోడుతో వెళ్తుండగా, ఇంజిన్ వేడెక్కి మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న కడప ఫైర్ ఆఫీసర్ బసివిరెడ్డి, సిబ్బంది ఫైర్ ఇంజినుతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అర్పివేశారు. ఈ ప్రమాదంలో లారీ క్యాబిన్, ఇంజిన్, ముందరి రెండు టైర్లు కాలిపోయాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కడప ఎడ్యుకేషన్: రోడ్డు ప్రమాదాలను నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోపాటు బాధ్యతగా వాహనాలను నడపాలని నెహ్రూ యువ కేంద్ర అధికారి మణికంఠ అన్నారు. శుక్రవారం కడప నెహ్రూ యువ కేంద్ర వారి ఆధ్వర్యంలో స్థానిక యూత్ హాస్టల్‌లో రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నియంత్రించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ యువత ట్రాఫిక్ రూల్స్‌ను పాటించడంతోపాటు అతి వేగాన్ని నియంత్రిస్తే ప్రమాదాలకు దూరంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తదితరులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శుభమస్తు షాపింగ్‌మాల్‌లో శుక్రవారం సిబ్బంది రక్తదానం చేశారు. షాపింగ్‌మాల్ నిర్వాహకుల తల్లిదండ్రులు బయ్యా వెంకట రమణయ్య, సరోజనమ్మ దంపతుల 10వ వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విశిష్ట అతిథి ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డితో కలిసి ఆమె రక్తదాన సేకరణను ప్రారంభించారు. ఇందులో భాగంగా షాపింగ్‌మాల్ సిబ్బంది రెడ్‌క్రాస్ సంస్థకు 37 యూనిట్లు, బృహద సంస్థకు 22 యూనిట్లు అందజేశారు. షాపింగ్‌మాల్ మేనేజర్ రమణయ్య, గోపాల్, రక్తదానం చేసిన సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌కు ప్రాజెక్టుల వారీగా కేటాయించిన 811 టిఎంసి లలో రాష్ట్ర విభజన అనంతరం కేంద్ర జిల్లా శక్తి చేసిన సద్దుబాట్ల ప్రకారం ఏపీకి టీఎంసీలు, తెలంగాణకు 298.94 టీఎంసీలు ఇప్పటివరకు వినియోగంలో ఉన్నాయన్నారు. ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం నాగార్జునసాగర్ లో లభ్యత ఆధారంగా ఏపీ 66%, తెలంగాణ 34% వాడుకునేలా కృష్ణానది యాజమాన్య బోర్డు సమావేశం నిర్ణయిస్తూ వచ్చిందని దాన్ని నేడు తెలంగాణ ప్రభుత్వం 50 శాతం తమకు వాటా కావాలని వితండవాదం చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో 27వ తేదీ సోమవారం మరో కృష్ణానది యాజమాన్య బోర్డు సమావేశం జరుగుతున్నందున ఏపీ ప్రభుత్వం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించి నీటి హక్కును కాపాడాలన్నారు.

మృతుడు ఎస్ఐ కుటుంబానికి ఆర్థిక సాయం


ఎస్ఐ భార్యకు చెక్కు అందజేస్తున్న జిల్లా అదనపు ఎస్పీ కె.ప్రకాష్‌బాబు

కడప అర్బన్: ప్రొద్దుటూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఎస్ఐ వై.సుబ్బరాయుడు కుటుంబానికి రూ.2.5 లక్షల సాయాన్ని చెక్కు రూపంలో మృతుడి భార్య వై. వెంకటలక్ష్మికి శుక్రవారం అందజేశారు. జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ(అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు పోలీసు వితరణ నిధి నుంచి ఈ చెక్కును శుక్రవారం అందజేశారు. కుటుంబీకుల యోగక్షేమాలు విచారించారు. అంకితభావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఎస్.జ్యోతి, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, బి. సెక్షన్ సూపరింటెండెంట్ బి. శ్రీనివాసనాయక్, జూనియర్ అసిస్టెంట్ మహజబీన్ పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

కడప ఎడ్యుకేషన్: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కును ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష అన్నారు. శుక్రవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్, పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ ఓటర్స్ డే సందర్భంగా విద్యార్థులకు ఓటు హక్కుపై వక్తృత్వ పోటీలు, గ్రూప్ డిస్కస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి. విజయలక్ష్మి దేవి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత అందరూ ఓటు హక్కును కలిగి ఉండాలన్నారు. పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు డాక్టర్ ఎం.వీరభద్రయ్య, డాక్టర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి ఒత్తిడి, ప్రభావాలకు గురి కాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

ఉపసంహరణపై నిషేధం ఎత్తివేయాలని వినతి

కడప ఎడ్యుకేషన్: సీపీఎస్ ఉద్యోగులు తమ కాంట్రిబ్యూషన్ నుంచి అవసరాల కోసం పొందే ఉపసంహరణపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. శుక్రవారం జిల్లా ఉప ఖజానా శాఖాధికారి ఎస్ వెంకటేశ్వర్లును ఆయన చాంబర్లో కలిసి అందుకు సంబంధించిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులు తమ వేతనం నుంచి కాంట్రిబ్యూషన్‌గా చెల్లించిన సొమ్ములో 25 శాతం వ్యక్తిగత, అనారోగ్య అవసరాల కోసం ఉపయోగించుకోవడానికి అవకాశం ఉందన్నారు. అయితే ఆ సొమ్ములు పొందడానికి ప్రస్తుతం ఖజానా శాఖ నిషేధం విధించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల చంద్రశేఖర్, గాజులపల్లి గోపీనాథ్, సురేష్ బాబు, రామకేశవ తదితరులు పాల్గొన్నారు.

డీటీసీపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.చంద్రశేఖర్ రెడ్డి ని ఉద్యోగం నుంచి తక్షణం తొలగించి, క్రిమినల్ కేసులను నమోదు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి యస్.వెంకటశివ, ఏపీ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి వడ్ల భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. నగర శివారులోని జిల్లా ఉప రవాణా శాఖా కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. డీటీసీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ నేత గొర్లరెడ్డి, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి శివ నాగేంద్ర, దేవి, యేసురత్నం, ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలి

కడప రూరల్ : రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని జిల్లా డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ నాగరాజు అన్నారు. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ డ్రగ్గిస్ట్ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా ఆల్ ఇండియా అసోసియేషన్ పిలుపుమేరకు శుక్రవారం స్థానిక కెమిస్ట్ భవన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ మాధవి, అన్నమయ్య జిల్లా డ్రగ్ కంట్రోల్ అధికారి జయరాముడు, డాక్టర్ రాఘవేంద్ర ప్రసాద్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ విద్యార్థి విభాగం నాయకులు రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. విద్యార్థి విభాగం నాయకులు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఓవైపు పోరాడుతూనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల సమస్యలపై కేంద్రీకరించి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు దత్త సాయి, శివారెడ్డి, రహీం, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నియామకం



డాక్టర్ గీతా ప్రియ


కడప అగ్రికల్చర్: వైఎస్సార్ జిల్లా పశుసంవర్ధ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ లక్కిరెడ్డి గీతాప్రియ చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని దుర్గులో ఉన్న కామినేటి పశు వైద్య విశ్వ విద్యాలయం బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. ఈమె ఈ పదవిలో మూడు సంవత్సరాలు కొనసాగనున్నారు. ఈమె నియామకం భారత పశు వైద్యమండలి ద్వారా జరిగింది.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ అశోక్‌కు అభినందనలు

కడప ఎడ్యుకేషన్: మైసూర్ విశ్వవిద్యాలయంలో ఈనెల 16 నుంచి 22 తేదీ వరకు నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరంలో కడప ఆర్ట్స్ కళాశాల విద్యార్థి అశోక్ యోగివేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం తరపున పాల్గొని అక్కడ జరిగిన విభిన్న కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థి అశోక్‌ను అభినందించారు.

వృత్తి విద్యతో ఉపాధి కల్పన, ఆర్థిక భరోసా


బ్యూటీ కోర్సులో భాగంగా గోర్లకు రంగు వేస్తున్న రాధికరెడ్డి


బ్యూటీ కోర్సు నేర్చుకుంటున్న విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో పాటు వృత్తి విద్య ఎంతో అవసరం. వృత్తి విద్య ద్వారా ఉపాధి కల్పన సాధ్యమని చెమ్ముమీయాపేట బాలికల హైస్కూల్ (గంగా భవానీ) ప్రధానోపాధ్యాయురాలు పులిమి మేరీ పేర్కొన్నారు. పీఎంశ్రీ వృత్తి విద్యా కోర్సులైన బ్యూటీ అండ్ వెల్‌నెస్ కార్యాక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కోసం శుక్రవారం ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా బి యూ ఫ్యామిలి సెలూన్‌ను 9,10 తరగతుల విద్యార్థులు సందర్శించారు. విద్యార్థులకు ఆధునాతన పద్ధతులతో హెయిర్ ట్రాన్స్‌పర్మేషన్, లేజర్ ట్రీట్‌మెంట్, మనిక్యూర్, పెడికేర్‌ల గురించి క్యాస్మోటిక్ అండ్ టెక్నాలజీ నిపుణులు రాధికరెడ్డి వివరించారు. దీంతోపాటు ఆధునాతన మిషన్స్‌ను ఎలా ఉపయోగించాలో కూడా తెలియజేశారు. బ్యూటీ కోర్సు తరువాత ఏ విధంగా ఈ వృత్తిలో రాణించవచ్చునో తెలియజేశారు. అనంతరం హెచ్ఎం పి. మేరీ, బ్యూటీ అండ్ వెల్‌నెస్ ట్రైనర్ సురేఖ మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సు వల్ల విద్యార్థులకు భవిష్యత్తులో ఉపాధితో పాటు ఆర్థిక భరోసా ఉంటుందన్నార. విద్యార్థులు అవకాశన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రణాళిక బద్ధమైన జీవనంతో ఒత్తిడికి దూరం


మాట్లాడుతున్న తెలుగు శాఖ ఆచార్యులు ఈశ్వర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: ప్రణాళిక బద్ధమైన జీవనంతో ఒత్తిడికి దూరంగా, ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని విద్య వైద్య రంగాల ప్రముఖులు ఉద్ఘాటించారు. తమిళనాడు శ్రీపెరంబుదూర్లోని రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ భారత ప్రభుత్వ పార్లమెంట్ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, వైవీయూ ఎన్.ఎస్.ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ×యువత మానసిక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడం(యూత్ మెంటల్ హెల్త్ ప్రమోషన్ పై టీవోటీ ప్రోగ్రామ్) పై శిక్షకుల మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. రెండో రోజు శుక్రవారం రిమ్స్ మానసిక వైద్య నిపుణులు డా. వెంకట రాముడు హాజరై మాట్లాడారు. మానసిక జబ్బులు, వాటి నివారణ మార్గాల గురించి అవగాహన కల్పించారు. తెలుగు శాఖ ఆచార్యులు ఎన్ ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆధునిక సమాజంలో ఒత్తిడిని అధిగమించడానికి సాహిత్యం ఉపకరించే విధానంపై ఉదాహరణలతో వివరించారు. సైకాలజీ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ లలిత మాట్లాడుతూ యువతలో మానసిక ఆరోగ్యానికి గల కారణాలు, నివారణ మార్గాలను సూచించారు. డాక్టర్ లక్ష్మీనారాయణ, బోటనీ అధ్యాపకులు డాక్టర్ ఎస్. రాజగోపాల్ రెడ్డి ఆరోగ్యకరమైన జీవన విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు పాల్గొన్నారు.

ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు స్పందన


విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్న అధికారులు

కడప కార్పొరేషన్ : ఏపీ ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో కడప డివిజన్ కార్యాలయంలోని పవర్ హౌస్ కాంపౌండ్ లో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల కోసం నిర్వహించిన విద్యుత్ ప్రత్యేక అదాలత్‌కు స్పందన లభించింది. రిటైర్డ్ న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయ మూర్తి, సభ్యులు కే రామ్మోహనరావు, ఎస్ఎల్ అంజనీ కుమార్ కార్యక్రమానికి హాజరై విద్యుత్ వినియోగదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక విద్యుత్ అదాలతో ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీర్ఘకాలిక సమస్యలు సమస్యలను ఇందులో పరిష్కరించుకోవచ్చు అన్నారు. కడప డివిజన్ ఈ హరి సేవియా నాయక్ , ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాలకులకు పట్టని చేనేత కార్మికుల కష్టాలు


చేనేత జౌళి శాఖ పరిపాలనా అధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: పాలకులకు చేనేత కష్టాలు కనబడటం లేదని, ప్రభుత్వాలు మారుతున్నా చేనేతలు తలరాతలు ఎక్కడా మారడం లేదని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వీరణాల శివ నారాయణ, దక్కా ఓబులేసు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేనేత జౌళి శాఖ కార్యాలయంలో పరిపాలనా అధికారి అహ్మద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయం తరువాత చేనేత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెందిన చేనేత పరిశ్రమ కార్పొరేట్ విధానాల వలన సంక్షోభంలో చిక్కుకున్నదన్నారు. ఫలితంగా చేనేత కార్మికులు ఆకలి చావులు, ఆత్మహత్యలకు బలవుతున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేతపై జి.ఎస్.టి. వేయటంతో చేనేత రంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే చేనేత పరిశ్రమను రక్షిస్తామని, జి.ఎస్.టి. రీయింబర్స్‌మెంట్ అమలు చేస్తామని, 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు జరుపుతామని వాగ్దానం చేశారన్నారు. చేనేత కార్మికులను ఆకలి చావుల నుంచి రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లా లక్ష్మీ నారాయణ, సహాయ కార్యదర్శి కొండయ్య, కమిటీ సభ్యులు బడిగించాల నారాయణ, చేతి వత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి బాలసుబ్బయ్య పాల్గొన్నారు.

ఎస్పీకి పోలీసు అధికారుల సంఘం అభినందనలు


జిల్లా ఎస్పీ ఈజి అశోక్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న పోలీసు అధికారుల సంఘం నేతలు

కడప అర్బన్: వైఎస్ఆర్ జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలను స్వీకరించిన ఈ.జి అశోక్‌కుమార్‌ను కడప జిల్లా పోలీసు అధికారుల సంఘం నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సమస్యలు వుంటే తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని ఎస్పీ వారికి చెప్పారు. పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, జిల్లా , రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, జిల్లా జాయింట్ సెక్రటరీ రఘునాథ్‌రెడ్డి, ఈసీ సభ్యులు టి.వి.పి మాధవి లత, ఏప్రిన్, అసోసియేషన్ సభ్యులు ఆర్ఎస్ఐ రామస్వామిరాజు, ఏఎస్ఐ రాచరాయుడు, హెడ్ కానిస్టేబుల్ పెంచలరాజు, సుబ్బరాయుడు, కానిస్టేబుళ్లు డి. పుల్లయ్య, నాగార్జున, తదితరులు ఎస్పీని కలిశారు. అలాగే జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్‌ను జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యోగా రాయల్, ట్రెజరర్ గంగరాజు యాదవ్, రాష్ట్ర, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు బంగారు రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు జగన్‌మోహన్‌రెడ్డి, కిరణ్ కుమార్, లక్ష్మీదేవి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

నూతన ఎస్పీని కలిసి జన వికాస్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఈజీ అశోక్ కుమార్‌ను శుక్రవారం జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎండీ తాహిర్, సమితి కన్వీనర్ మన్సూర్ అలీఖాన్ కలిసి పూల మొక్కను ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సేవాసమితి ప్రతినిధులు డాక్టర్ శ్రీనివాసులు, జావిద్, అమీన్, అబ్దుల్ వాజిద్, శివ తదితరులు పాల్గున్నారు.

క్రీడల అభివృద్ధికి సహకరించాలని వినతి

– డీఈఓను కోరిన వ్యాయామ ఉపాధ్యాయులు


డీఈఓకు పూలమొక్క అందజేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో పాఠశాల విద్యలో వ్యాయామ విద్య, క్రీడల అభివృద్ధికి సహకారం అందించి క్రీడానిధులు సకాలంలో విడుదలయ్యేలా చర్యలు తీసుకోవాలని వ్యాయామ ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం నూతన డీఈఓ డాక్టర్ షేక్ షంషుద్దీన్‌ను కలిసి పూలమొక్క అందజేసి శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకులు బి. శివ శంకర్‌రెడ్డి, ఎం. ప్రవీణ్‌కిరణ్ జిల్లాలోని వ్యాయామ విద్య ప్రగతి గురించి డీఈఓకు వివరించారు. క్రీడానిధులు విడుదల చేయించాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రెడ్డయ్య, రాయుడు, రామచంద్ర, మహబూబ్‌బాషా, ఎజాస్‌అహ్మద్, అగ్గిరప్ప పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, ఆఫీసు సిబ్బందిని రెండు కళ్లుగా చూడాలి

ఉపాధ్యాయులను, డీఈఓ ఆఫీస్ సిబ్బందిని రెండు కళ్లుగా చూడాలని, ఉపాధ్యాయుల పట్ల వివక్ష చూపకూడదని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్‌ను ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక ప్రధాన కార్యదర్శి ఎస్. ఇలియాస్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి. రామాంజనేయరెడ్డి, జిల్లా బాధ్యులు బాలిరెడ్డి, రామ్మోహన్, దిలీప్ కుమార్, రామలక్ష్మి రెడ్డి, సూర్య ప్రకాష్, చంద్రశేఖర్ కోరారు. నూతన డీఈఓగా బాధ్యతలు చేపట్టిన షంషుద్దీన్ వారు డీఈఓ కార్యాలయం వద్ద కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా లెక్కల జమాల్ రెడ్డి మాట్లాడుతూ డీఈఓ కార్యాలయంలో ఒకే సీట్లో ఏళ్ల తరబడి సిబ్బంది ఉండడం సబబు కాదని, మార్చాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దీంతో పాటు విద్యాశాఖ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

కడప ఉక్కు పరిశ్రమ కోసం పోరాడాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో ఉక్కు పరిశ్రమ కోసం ప్రజాప్రతినిధులు పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఫిబ్రవరి 1, 2, 3, తేదీలలో నెల్లూరులో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర 27వ మహాసభల పోస్టర్లను అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా కడప జిల్లాలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 30, 31వ తేదీలలో 'కడప ఉక్కు– ఆంధ్రుల హక్కు నినాదంతో జీపు జాత' నిర్వహిస్తున్నామని తెలిపారు. కడప ఉక్కు ఫ్యాక్టరీని శిలాఫలకాల ఫ్యాక్టరీగా మార్చిన ఘనత టీడీపీ, వైఎస్సార్ సీపీలదేనని ఎద్దేవ చేశారు. మాజీ ఎంపీ పెద్ద పసుపుల ఈశ్వర్ రెడ్డి విశాఖ ఉక్కు కోసం మన పదవికి రాజీనామా చేశారని, అలాంటి వారి స్ఫూర్తితో జిల్లాలోని ప్రజాప్రతినిధులు కడప ఉక్కు కోసం పోరాడాలని తెలిపారు.

కడప రీజియన్‌లో సమస్యలు పరిష్కరించాలి


ఆర్ఎంకు వినతిపత్రాన్నిసమర్పిస్తున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప రీజియన్‌లోని ఆరు డిపోలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రీజినల్ కార్యదర్శి సుధాకర్, రీజినల్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.నారాయణలు కోరారు. శుక్రవారం కడప రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డికి సమస్యలపై ఈ మేరకు వినతి పత్రాన్నిసమర్పించారు. యూనియన్ డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు, ప్రెసిడెంట్ జయరాములు పాల్గొన్నారు.